కథ

# అనామిక

—వి. సుందరీమూర్తి

సాయంకాలం నుంచీ పట్టిన ముసురు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా మారి రేకులమీద పెద్ద శబ్దంతో చినుకులు పడటం మొదలుపెట్టింది. వానకు తోడు ఈదురు గాలి, స్టేషన్ మొత్తంమీద రెండు మూడు లైట్ల కంటే ఎక్కువ లేవు. ఆ గుడ్డి దీపాల వెలుగులో బైట అలుముకున్న చీకటి ఇంకా చిక్కగా నల్లగా కనిస్తోంది.

స్టేషన్‌లోని గోడ గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. ప్రయాణీకులు నలుగురైదుగురు కంటే ఎక్కువ లేరు. అందరూ తలొక చోట కునికిపాట్లు పడుతున్నారు. ఏడు గంటలకు రావలసిన ప్యాసింజర్ బండి జాడ లేదు. గాలి విసురు హెచ్చింది. శాలువా దగ్గరకు లాక్కున్నాడు సంజీవి. దగ్గరలో వున్న పల్లెటూరు నుంచి ఆరు గంటలకే స్టేషన్‌కు వచ్చాడు. రైలు రాకకోసం స్టేషన్ మాస్టర్నీ, పోర్టర్లనీ అడుగుతున్నారు ప్రయాణీకులు. రైలుకోసం వేచి చూడలేని ఈ అమాయక ప్రాణులు ప్రయాణాలు ఏం చేస్తారో? అనుకున్నాడు సంజీవి. స్టేషన్ మాస్టర్ రూమ్‌లో ఫోన్ మోగడంతో ప్రయాణీకుల్లో ఆశతో కూడిన ఆనందం కన్పించింది. నిర్లిప్తంగా శాలువా మరింత దగ్గరకు లాక్కుని చూస్తున్నాడు సంజీవి. ఢిల్లీ నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి రెండు బోగీలు తల్లక్రిందులై పక్కనే వున్న కాల్వలో పడటంతో ఈ ప్యాసింజర్ బండి దార్లోనే ఆగిందనే వార్త వచ్చింది. ఇక ప్రయాణీకులు రైలు ప్ర మాదాల గురించి మాట్లాడుకోటం మొదలుపెట్టారు.

అసలు ఈ రోజుల్లో బయలుదేరిన రైలు సవ్యంగా గమ్యం చేరుతుందనే గ్యారంటీ ఎక్కడుందండీ? ఒక్క రైలేమిటి, బస్సులు, విమానాలూ, కార్లూ, ఒకటేమిటి ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట ఏదో ఒక ప్రమాదం. బైటికి వెళ్లిన మనిషి ఇంటికి వచ్చే దాకా భయమే గదా! పూర్వం ఇన్ని ప్రమాదాలు జరిగేవా? అసలు జీవితం ఎంత ప్రశాంతంగా వుండేది. అసలు దీనికంతటికీ కారణం ఈ రాజకీయ నాయకులే నండీ బాబూ!

ఇంతలో ఊళ్లోకి వెళ్లే ఆఖరి బస్సు వచ్చి స్టేషన్ బైట ఆగింది. కొంతమంది బస్సెక్కి ఊళ్లోకి ప్రయాణమయ్యారు. తను కూడా ఆ పూటకి ప్రయాణం చాలించి ఊళ్లోకి వెళదామా? అనే ఆలోచనలో పడ్డాడు సంజీవి. ఊళ్లోకి వెళ్లి కరణంగారి ఇంటి వరండాలో పడుకున్నా లేక ఈ స్టేషన్ బెంచి మీద పడుకున్నా ఒకటేనని నిర్ణయించుకుని అక్కడే పడుకున్నాడు.

అంతటి నిశ్చల, నిర్మానుష్య వాతావరణంలో చిన్ననాటి చదువు, తీపి జ్ఞాపకాలు, అమ్మ అనురాగం తలుచుకొన్న సంజీవి హృదయం తీయగా స్పందించింది. సంజీవి తండ్రి పౌరోహిత్యం చేసేవాడు. తనకు కల్గిన సంతానంలో దక్కినది సంజీవి ఒక్కడే. చాలా ముద్దుగా పెరిగాడు. ఇంటర్ పరీక్షలు అయిన నెల రోజులకే పాము కాటు వల్ల కాలం చేసింది తల్లి. ప్రొద్దున తనకు అన్నంపెట్టిన అమ్మ సాయంకాలానికి లేదు. ఈ సంఘటనకు అంతులేని ఆవేదనతో క్షోభించాడు. ఒక రోజు ఉదయం టౌనుకు వెళ్లి మిలిటరీ రిక్రూట్‌మెంట్ ఆఫీసు ముందు నుంచున్నాడు. సెలక్ట్ అయి బేసిక్ ట్రైనింగ్ తర్వాత క్లర్క్‌గా స్థిరపడ్డాడు. 26 ఏళ్లకే అవసరం లేని గడియారంలా తిరిగింది జీవితం. ఉదయం ఆరు గంటల నుంచీ రాత్రి ఎనిమిది గంటరవరకూ తీరికలేని పని. ఒక్కొక్కప్పుడు నైట్ డ్యూటీలు, ఎక్సర్‌సైజులు, ఇన్స్పెక్షన్లు, వార్‌గేములు, బ్రిడ్జింగ్ క్యాంపులు. ఈ మధ్యలో రెండు సంవత్సరాల కొకసారి ట్రాన్స్ఫర్లు. రేసు గుర్రంలా పరిగెత్తింది కాలం. ఈ హడావుడిలో సంజీవికి ప్రమోషన్లు వచ్చాయి. అతనిలోని నిజాయితీ, పనిలో చూపించే శ్రద్ధ, పై ఆఫీసర్లు మెచ్చుకునేట్లు చేశాయి. అతను సుబేదార్ మేజర్‌గా రిటైరు అయ్యాడు. హైదరాబాద్‌లో స్థిరపడి, ఓ చిన్న బుక్ స్టాల్ పెట్టుకుని కాలం వెళ్లబుచ్చుతున్నాడు.

* * * * * * *

గతాన్ని నెమరువేసుకున్నాడు సంజీవి. సెలవులకు పెద్దగా వచ్చేవాడు కాదు. తండ్రి మాత్రం ప్రతినెలా డబ్బు పంపేవా డు. 1971లో పాకిస్తాన్ యుద్ధం టైమ్‌లో సంజీవి తండ్రి చనిపోయాడు. ఆ వార్త అతనికి అందేసరికి ఆరురోజులు పట్టింది. వెంటనే తండ్రి కడసారి చూపుకు నోచుకోని బాధను దిగమింగుకుని అవసరమైన ఖర్చులకు మాత్రమే డబ్బు పంపగలిగాడు. ఆ తర్వాత తన ఊరు రావటం ఇదే. చిన్ననాటి స్నేహితులంతా ఎక్కడో వున్నారు. కరణంగారి అబ్బాయి రమణ మాత్రం వ్యవసాయం చేస్తూ ఊళ్లోనే వుంటున్నాడు. హెడ్‌మాస్టర్‌గారి అమ్మాయి మాలతిని పెళ్లి చేసుకున్నాడు రమణ.

స్వగ్రామంలో అడుగుపెట్టి రమణను కలిసాడు.

"ఇన్ని ఏళ్లల్లో ఏనాడూ పెళ్లి చేసుకోవాలనిపించ లేదురా నీకు?" సాయంకాలం ఆరు బయట



మంచంమీద కూర్చుని అడిగాడు రమణ.

"నాలుగైదు సార్లు ఉత్తరాలు రాశాను. మంచి సంబంధాలున్నాయని, జవాబైనా రాశావు కాదు"

"ముప్పై ఏళ్ల తర్వాత ఇక్కడికి రావటం ఇదేనా?"

"పెళ్లి అయితే ఎలా వుంటుందో తెలీని నాకు పెళ్లి కాకపోతే లోటు అని ఎలా అర్థమవుతుందిరా?" నవ్వుతూ అన్నాడు సంజీవి.

"కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ దేశమంతా తిరిగినా నీకు నచ్చిన అమ్మాయే దొరకలేదా సంజీవి?" హాస్యంగా అడిగింది మాలతి.

నచ్చిన అమ్మాయి అంటే ఎవరు? ఎలా వుంటుంది? అసలు నచ్చటం అంటే ఏమిటి? ఈ నచ్చటం అనేది మానసికమా? శారీరకమా? తనకు నచ్చిన అమ్మాయి ఎవ్వరైనా కనిపించిందా? ఏమో? ఇలాంటి ఆలోచనల్లో తేలుతూ అర్థంలేని ఒక తన్మయత్వంలో తన పరిసరాలను మరిచాడు.

* * * * * *

ప్రైవేటుగా బి.ఏ పరీక్ష రాయడానికి వచ్చాడు సంజీవి. రిటైరు అయిన తర్వాత కాలక్షేపానికి చదువుతున్నా, తన చిన్ననాటి చదువు వాతావరణంలో పడిపోయాడు. పరీక్ష టైం దగ్గర పడుతోంది. బాగా ఎండగా వుంటే కాలేజి దగ్గర వున్న ఓ చెట్టు కింద నిలబడ్డాడు. విద్యార్థుల్లో పరీక్ష హడావుడి, గుంపులుగా నిలబడి పుస్తకాలు చదవడం, మాట్లాడుకోవడం కన్పించింది. తనకేమీ

కంగారు లేదు. పనిలేక రాస్తున్న పరీక్ష ఇది. ఇంతలో ఒక అమ్మాయి వేగంగా నడుచుకుంటూ వచ్చి అదే చెట్టు కింద ఆగి " టైం ఎంతో చెబుతారా?" గడియారానికి కీ ఇస్తూ అడిగింది.

"పావు తక్కువ రెండు. పరీక్ష హాల్లోకి వెళ్లే టైం అయింది. మీరూ పరీక్ష రాయడానికే వచ్చారా?" అడిగాడు సంజీవి.

"పరీక్ష రాయడానికి కాకపోతే పిక్నిక్‌కు అను కుంటున్నారా?"

"అబ్బెబ్బే! అదికాదు" తెల్లమొహం వేశాడు సంజీవి.

మెల్లగా కాలేజిలోకి వెళ్లి తన నెంబరు చూసుకుని రూమ్‌లోకి వెళ్లాడు.

పేపరు అనుకున్నంత కష్టంగా లేదు. బాగానే రాశాడు.

పరీక్ష రాస్తూ పక్కనే వున్న కిటికీలోంచి బయటికి చూశాడు. పక్క బిల్డింగ్‌లో కిటికీ పక్కనే కూర్చుని ఓ అమ్మాయి పరీక్ష రాస్తోంది. అతనికి కన్పించిన అమ్మాయి టైమ్ అడిగిన అమ్మాయేనా? ఆ అమ్మాయి ఎలాంటి చీర కట్టుకుందో తను గమనించలేదు. అయినా తనకెందుకని ఊరుకున్నాడు.

పరీక్ష అవ్వగానే ఆ అమ్మాయి రిక్షా ఎక్కుతూ కన్పించింది. " పరీక్ష బాగా రాశారా?" అడిగాడు సంజీవి.

"ఓ. మీరా! బాగానే రాశాను" అంటూ రిక్షా ఎక్కి వెళ్లిపోయింది. అప్పుడు చూశాడు సంజీవి ఆమె కట్టుకున్నది పచ్చ చీర అని.

మర్నాడు మళ్లీ సంజీవి నిలబడ్డ చెట్టు దగ్గరకు వచ్చి నిలబడింది 'ఆమె'.

"టైమ్ పావు తక్కువ రెండు" అన్నాడు సంజీవి.

ఆమె గలగలా నవ్వుతూ నవ్వింది. " ఈరోజు జాగ్రత్తపడ్డాను లెండి" అంటూ పరీక్ష హాలువైపు నడవసాగింది.

"మీది ఏ బ్లాకు?" అడిగింది.

"అదిగో అక్కడే మేడ మీద కిటికీ దగ్గర సీటు " అన్నాడతను.

"అది ఏ బ్లాకు, నాది సి బ్లాకు, అదిగో కింద రూమ్‌లో కిటికీ దగ్గర సీటు" అంటూ హాల్లోకి వెళ్లిపోయింది.

పరీక్షలు జరిగినన్ని రోజులుఇదే దిన చర్య. ఆమె రావడం, చెట్టు కింద తనతో పాటు నిలబడటం, రాసిన పేపర్ల గురించి మాట్లాడుకోవటం, ఇద్దరూ ప్రవేట్ క్యాండిడేట్లు అవటంవల్ల రెగ్యులర్ స్టూడెంట్స్‌తో అంత పరిచయం లేకపోయింది. అలాగా ఇద్దరికీ కొంత పరిచయం ఏర్పడింది. చివరిరోజు పరీక్ష కాగానే మామూలుగానే నడుస్తూ బయటికి వచ్చారు ఇద్దరూ.

చల్లని గాలి వీస్తోంది. "ఇలాగే నడుస్తూ బస్టాండ్ దాకా పోదామా?" హఠాత్తుగా అడిగాడతను.

ఆమె ఒక్క క్షణం అతని వంక చూసి "పదండి" అంటూ నెమ్మదిగా అతని పక్కగా నడవసాగింది. తల తిప్పకుండా కంటి చివరినుంచే ఆమెను చూశాడతను. ఆమె మంచి పొడగరి. ఆమె చెవులకు పెట్టుకున్న ఎర్రరాళ్లు పొదిగిన బంగారు జూకాలు సాయంకాలపు నీరెండలో మెరుస్తున్నాయి. నడుస్తూ వుంటే ఆమె మువ్వల పట్టెల సందడి చిరుగంటల సవ్వడిలా వుంది. ఆమె చేతి గాజులు చేస్తున్న సవ్వడి జలతరంగిణి సందడిలా వుంది.

బస్టాండ్ చేరారిద్దరూ. ఆమె టైమ్ చూసుకుంది. "అయిదున్నర దాటింది. బస్సు పోయిందేమో" దిగులుగా అనుకుంది.

"తర్వాత బస్సులో వెళ్లొచ్చులెండి. మరో పావుగంటలో ఇంకొకటి వస్తుందిగా" అన్నాడతను.

"అవుననుకోండి. ఇంటి దగ్గర మా అబ్బాయి ఏం చేస్తున్నాడో ఏమో? పిచ్చి మా అమ్మను విసిగిస్తూ వుంటాడు. మధ్యాహ్నం వచ్చేటప్పుడు అన్నంపెట్టి నిద్ర పుచ్చి వస్తున్నాను. రోజూ అయిదున్నర బస్సయితే కొంచెం ముందుగా ఇల్లు చేరుతా, అయినా రేపటి నుంచీ ఈ బాధలేదు కదా! ఇంట్లోనే వుంటాను గదా!" అంటూ తనలో తను అనుకుంటూ సమాధానపడసాగిందామె.

ఒక్కక్షణం సంజీవి గుండె లయ తప్పింది. మళ్లీ అంతలోనే సర్దుకుంటూ "మీకు అబ్బాయి వున్నాడా? మీకు పెళ్లి అయిందా?" అడిగాడు.

"అదేమిటి ఒక్కసారిగా అలా అడిగారు? నాకు పెళ్లయిందండీ బాబూ, పెళ్లయి ఐదేళ్లయ్యింది. నాకు మూడు ఏళ్ల పుత్రరత్నం కూడా వున్నాడు. మావారు పై చదువులకని అమెరికా వెళ్లారు. వారు వచ్చేదాకా, మా అమ్మగారింట్లో వుంటున్నాను. ఊరికే కూర్చుంటే తోచక గ్రాడ్యుయేట్ అన్పించుకోవాలని పరీక్షకు కట్టాను. మట్టెలు, నల్ల పూసలు లాంటివన్నీ వారికి నచ్చవు. అందుకని పెట్టుకోను. మీరు పొరపడ్డంలో ఆశ్చర్యం లేదు లెండి. నాకు పెళ్లయిన విషయం నాకు తెల్సుగాని ఇతరులు పొరపడతారని తోచనే లేదు" అని ఆమె చెప్తకుంటూ వచ్చింది. అతను మాత్రం ఎటో చూస్తున్నాడు.

ఉన్నట్లుండి సంజీవి " ఒక్క నిముషం. ఇప్పుడే వస్తాను, ఎటూ వెళ్లకండి" అంటూ రోడ్డు దాటి ఒక షాపు దగ్గరకు నడిచాడు. వాహనాల రద్దీలో ఆమెకతను కన్పించలేదు. దూరంగా ఆమె ఎక్కవలసిన బస్సు వస్తూ కనిపించింది. ఒక్క నిముషం అతనికోసం అటూ ఇటూ చూసి మెల్లగా బస్సు వైపు నడిచింది. బస్సు ఎక్కబోతుండగా పరుగులాంటి నడకతో వచ్చాడతను. ఒక చేతిలో సన్నజాజిమాల, మరో చేతిలో బిస్కట్ ప్యాకెట్ "తీసుకోండి"అంటూ ఆమె కందించాడు. ఆమె కన్నులలో పున్నమి చంద్రుని కాంతి. ఆమె నవ్వులో వెన్నెల వెలుతురు. ఆమె ముఖంలో సంభ్రమాశ్చర్యాల సమ్మేళనం, ఏదో అద్భుత దృశ్యాన్ని చూస్తున్నట్లు నిలబడిపోయాడు సంజీవి.

కండక్టర్ 'రైట్' అన్నాడు. ఆమె బస్సెక్కింది. అప్పడే వీచిన గాలికి ఆమె చేతిలోని సన్నజాజుల పరిమళం చుట్టూ ఆవరించింది. పూలు జడలో పెట్టుకోవటం అతనికి బస్సు కిటికీలోంచి కన్పించింది. బస్సు కనుమరుగయ్యే దాకా చూస్తూ వుండిపోయాడు. ఆమె మాత్రం అతన్ని తిరిగి చూసిందో లేదో బస్సుకి లేచిన ధూళిలో కనిపించలేదు.

అతనికి ఆమె పేరు కూడా తెలియదు. ఆమె అతనికి అనామిక!!

* * * * * *

టీ.వీలో 'అనుభూతి' అనే కథానిక ప్రసారం అయ్యాక ఆ కథానిక రచయిత్రి ఆనందిగారితో ముఖాముఖి.

"ఆనందిగారూ! మీరు ఎప్పటినుంచి కథలు రాస్తున్నారు? మీ కథలు స్వానుభవాలా? లేక ఊహాజనితాలా?"

"నేను మొదటి కథ ఇంటర్ చదివేటప్పుడు రాశాను. కథలు రాయటంలో కొన్ని స్వానుభవాలు, కొన్ని ఇతరుల నుంచి విన్నవి, మరి కొన్ని ఊహలు, అన్నీ వుంటాయి. ఏది ఏమైనా స్వంతానికి అన్వయించుకోకుండ రచన చేయడం సాధ్యం కాదు. ఇది నా అభిప్రాయం మాత్రమే"

"ఆనందిగారూ! ఇప్పుడు మనం ప్రసారం చేసిన కథలో 'సంజీవి' పెళ్లి చేసుకోలేదు గదా!రిటైర్ అయి పరీక్ష రాసే వయస్సులో ఆమెను ప్రేమించాడంటారా? ఆరాధించాడంటారా? ఆ వయస్సు వరకు అతనికి ఎలాంటి స్త్రీ తటస్థపడలేదా?"

"ప్రేమ, ఆరాధన అనే పదాలు మనం చాలా తేలికగా ఉపయోగిస్తూ ఉంటాము. కానీ నా ఉద్దేశ్యంలో 'ప్రేమ' ఒక అద్భుత భావన. హృదయాన్ని స్పందింపజేసే ఒక మధురమైన అనుభూతి. భావ మాధుర్యం మనస్సులో వరదలా పొంగి ఆత్మను ముంచెత్తి మనిషి జీవితాన్ని అమృత సరోవరంలా మార్చగలదు. దానిని శాశ్వతంగా నిలిపేదే 'ఆరాధన'. సంజీవి జీవితంలో ఇది అతి సామాన్యమైన ఓ సంఘటన. కానీ అది ఒక అపురూపమైన అనుభవం. అతను కూడా సామాన్యమైన వ్యక్తే. అతని వ్యక్తిత్వం, సంస్కారం, అనుబంధం అనేవి అతనిలో ప్రతీకగా నిలిచి ఉన్నాయి. 'సంజీవి' ప్రకృతిని ప్రేమించే వ్యక్తి. అతనికి ఏదో కావాలన్న ఆశగాని, లేదన్న నిరాశగాని లేవు. ప్రతిమనిషి ఏదో ఒక అసంతృప్తితో లేదా ఏదో ఒక సమస్యతోనో మథనపడుతూ వుంటాడు. కాని సంజీవిలో అసమానమైన తృప్తి, అనంతమైన ఆనందం వున్న నిజమైన మనిషి. భగవంతుడు సృష్టించిన మనిషి"